సాక్షి
జగిత్యాల

శుక్రవారం। 13। జనవరి। 2023



రైతు సేవలో 'ఆగ్రోస్'

ప్రభుత్వ సంస్థ ఆగ్రోస్ సరికొత్తగా రైతులకు సేవలు అందించేందుకు సిద్ధమైంది. యంత్రాలు అద్దెకు ఇవ్వనున్నారు. IIలో▸



మోడల్ స్కూల్ పిలుస్తోంది

మోడల్‌స్కూళ్లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. IIలో▸

గరిష్టం/కనిష్టం
32.0 /14.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

'సదరం'పై చేతులెత్తేసిన ఏసీబీ..!

- సివిల్ ఆసుపత్రి కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్ల రాకెట్
- గతేడాది సుమోటోగా స్వీకరించిన ఏసీబీ
- ప్రశ్నావళికే పరిమితమైన అధికారులు
- అనుమానితులపై తూతూమంత్రపు విచారణ
- చివరికి ఏసీబీ విచారణను సైతం అడ్డుకున్న నిందితులు?

'317 జీవో అమలు సందర్భంగా వరంగల్ జిల్లాలో బదిలీని తప్పించుకునేందుకు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు అప్పగించిన దాదాపు 40కిపైగా నకిలీ దివ్యాంగ సర్టిఫికెట్లను గుర్తించారు. అందులో 10కిపైగా సర్టిఫికెట్లు కరీంనగర్ సివిల్ ఆసుపత్రి నుంచి జారీ అయినవే. అదే సమయంలో కరీంనగర్‌లోనూ పలు అనుమానాస్పద సర్టిఫికెట్లపై తీవ్ర అభ్యంతరాలు రావడంతో వాటిని పక్కనపెట్టాలని స్వయంగా కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఈ అనుమానాస్పద సర్టిఫికెట్లు సైతం కరీంనగర్ సివిల్ ఆసుపత్రి ఇచ్చినవే కావడం గమనార్హం'.



కరీంనగర్ సివిల్ ఆసుపత్రి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ సివిల్ ఆసుపత్రి కేంద్రంగా 'సాక్షి' బయటపెట్టిన అనర్హులకు సదరం సర్టిఫికెట్ల స్కామ్ వ్యవహారం ఎంత వేగంగా బయటికి వచ్చిందో.. ఇప్పుడు అంతే వేగంగా మూసివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతేడాది ఫిబ్రవరి 6న 'దివ్యంగా దోచేస్తున్నారు' శీర్షికన సివిల్ ఆసుపత్రిలో కొందరు వైద్యసిబ్బంది, తాత్కాలిక సిబ్బందితో కుమ్మక్కై అనర్హులకు దివ్యాంగ సర్టిఫికెట్లు కట్టబెడుతున్న వైనాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. ఆ తరువాత వరుస కథనాలు వచ్చాయి. దీనికి తమకు సంబంధం లేదని చెప్పిన సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రత్నమాల.. సదరు ఆరోపణలు వచ్చిన డేటా ఎంట్రీ ఆపరేటర్లు శ్రీనివాస్, కిశోర్‌ను ఈ వ్యవహారానికి బాధ్యులుగా చేస్తూ విధుల నుంచి తప్పించారు. అప్పటికే డీఆర్‌డీఏ వీరిని తొలగించి రెండేళ్లు గడిచినా.. వీరు జీతం లేకుండా.. అనర్హులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తూ స్వేచ్ఛగా దందా కొనసాగించారు. అసలు ఏ వైకల్యంలేని వారికి సైతం 100 శాతం వైకల్యం జారీ చేసిన విధానం చూసి సివిల్ ఆసుపత్రి సిబ్బందే ముక్కున వేలేసుకుంటున్నారు. ఇలాంటి సర్టిఫికెట్లను గతేడాది 'సాక్షి' ప్రచురించినా.. ఇప్పటికీ సదరం వెబ్‌సైట్‌లో అలాగే ఉంచడం గమనార్హం.

విచారణలన్నీ తుంగలోకే..!

'సాక్షి' కథనాలతో జిల్లా యంత్రాంగం తప్పనిసరి పరిస్థితుల్లో అప్పటి అడిషనల్ డీఆర్‌డీవో నేతృత్వంలో విచారణకు ఆదేశించింది. వాస్తవానికి 2015 నుంచి ఉమ్మడి జిల్లా ఉన్నప్పటి నుంచి నకిలీ సర్టిఫికెట్ల దందా నడుస్తోందని ఆరోపణలు ఉన్నా.. కేవలం 2021 జనవరి నుంచి 2022 జనవరి వరకు జారీ అయిన సర్టిఫికెట్లపై మాత్రమే విచారణ జరిగింది. 16 మండలాల్లోనూ విచారణ జరిపిన అధికారులు నివేదికను కలెక్టర్‌కు పంపారు. కానీ, ఈ కేసులో నిందితులుగా ఉన్న అధికారులు చక్రం తిప్పి దాన్ని వెలుగులోకి రానీయలేదు. అధికారుల తీరుపై విమర్శలు రావడంతో మరోసారి మార్కెటింగ్ శాఖలోని ఓ ముఖ్య అధికారితో విచారణ చేయించారు. తర్వాత మరో అధికారి కూడా ఇదే అంశంపై విచారించారు. ఈ ఇద్దరూ ఏం విచారణ చేశారో? ఏం నివేదిక ఇచ్చారో? ఎవరికీ తెలియదు. అంతకుముందు టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణ చేశారు. సదరు సర్టిఫికెట్లపై సివిల్ ఆసుపత్రి కూడా విచారణకు ఓ వైద్యుడిని నియమించింది. ఎన్ని విచారణలు వేసినా ఇంతవరకూ వాస్తవాలు వెలుగుచూడలేదు.

ప్రభుత్వానికి రూ.కోట్ల నష్టం..!



సూపరింటెండెంట్ రత్నమాల జారీ చేసిన 100 శాతం వైకల్యం సర్టిఫికెట్

సదరం సర్టిఫికెట్ల జారీ వెనక రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. వీటిని వ్యాపారులు, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఇలా పలువురు అనేక రకాలుగా దుర్వినియోగం చేస్తున్నారు. ఇలాంటి జాబితాలో సామాన్యులు కూడా ఉన్నారు. ఏ వైకల్యం లేకపోయినా.. చెవిటి, అంధ సర్టిఫికెట్లు తీసుకుని ప్రతినెలా ఠంచనుగా ఖాతాలో రూ.3,000 చొప్పున వికలాంగ పింఛన్ పొందుతున్నారు. ఇలాంటి జాబితాలో స్థానిక ప్రజాప్రతినిధుల బంధువులు అధికంగా ఉండటం గమనార్హం. పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారులు ఇన్‌కం ట్యాక్స్, బదిలీల్లో మినహాయింపు కోసం వీటిని వాడుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఈ లెక్కన నెలనెలా రూ.కోట్ల నష్టం ఖజానాకు చిల్లులు పడుతోంది. ఈ వ్యవహారంలో కనీసం ఏసీబీతోనైనా న్యాయం జరుగుతుందని భావించినా చివరికి నిరాశే మిగిలిందని సాక్షాత్తూ సివిల్ ఆసుపత్రి సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు.

ఏసీబీ ప్రవేశంతో మారిన సీన్..!

ఈ కేసులో సూత్రధారులకు రాజకీయ అండదండలు దండిగా ఉన్నాయి. దీంతో జిల్లా అధికారుల విచారణ నివేదికలను బయటికిరాకుండా తొక్కిపెట్టారు. కానీ.. ఏసీబీ సుమోటోగా కేసు స్వీకరించే సరికి అందరికీ చెమటలు పట్టాయి. ఏసీబీ విచారణ ప్రారంభించాక ఇటు డీఆర్‌డీవో, అటు సివిల్ ఆసుపత్రిలోని కిందిస్థాయి సిబ్బందిని పిలిపించి విచారించారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులకు కీలక ప్రశ్నల జాబితా పంపించి సమాధానాలు సేకరించారు. ఆ తర్వాత విచారణ ఊపందుకుంటుందని అంతా అనుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ వ్యవహారాన్ని సుమోటోగా పరిగణించి విచారణకు చేపట్టిన ఏసీబీ అధికారులు తొలుత దర్యాప్తును పరుగులు పెట్టించినా.. ఇప్పుడు ఎటూ కాకుండా స్తంభించిపోయింది. దీని వెనక కొందరి ఒత్తిళ్లే కారణమని గుసగుసలు వస్తున్నాయి. మొత్తానికి అవినీతిపై వేసిన విచారణను పూర్తి చేయడంలో అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) విఫలమైందన్న విమర్శలను మాత్రం మూటగట్టుకుంటోంది.

న్యూస్‌రీల్

పోషణలోపం ఉన్న పిల్లలను గుర్తించాలి



పిల్లలను పరీక్షిస్తున్న వైద్యుడు

జగిత్యాల: జిల్లాలో పోషణలోపం ఉన్న పిల్లలను గుర్తించాలని మహిళాశిశు సంక్షేమాధికారి నరేశ్ అన్నారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోపపోషణ ఉన్న పిల్లలను గుర్తించి ఆహారానికి సంబంధించిన పలు సూచనలు, మందులు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ప్రతి గురువారం వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, తల్లిదండ్రులు సైతం సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంవో చంద్రశేఖర్, పిల్లల వైద్య నిపుణుడు భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా దళితబంధు ఇవ్వాలి



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

జగిత్యాల: పార్టీలకతీతంగా దళితబంధు ఇవ్వాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింబాద్రి అన్నారు. జిల్లా కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలని, దళితబంధు కొందరికే ఇస్తున్నారని, పార్టీలకతీతంగా ఇవ్వాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఫోన్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హ్యాక్ చేస్తున్నాయని, ఈ విషయమై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని అన్నారు. సంపత్‌కుమార్, మద్దెల నారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జగిత్యాల: మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామంలోని ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వినోద్‌పై చర్యలు తీసుకోవాలని మేరు సంఘం నాయకులు డీఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. వినోద్ పాఠశాల సమయంలో విధులు నిర్వహించకుండా, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడని పేర్కొన్నారు. ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, మల్లేశం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం అందజేత



పురస్కారం అందుకుంటున్న శరత్‌చంద్ర

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని కొమటికొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వాసాల శరత్‌చంద్ర రాష్ట్రస్థాయి తెలంగాణ కీర్తి సాహితీ అవార్డు అందుకున్నారు. కళాశ్రీ సాహితీ వేదిక జగిత్యాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అలిశెట్టి సాహితీ అలిశెట్టి పురస్కారాన్ని కరీంనగర్ అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్‌లాల్ చేతులమీదుగా అందుకున్నారు. కళాశ్రీ సంస్థ అధ్యక్షుడు గుండెటి రాజు, అనిత ఉన్నారు.

జిల్లా అదనపు కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మల్లేశం గౌడ్

జగిత్యాలటౌన్: జిల్లా అదనపు కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జగిత్యాల పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కాసారపు మల్లేశం గౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వ హోం సెక్రటరీ రవి గుప్తా ఉత్తర్వులు జారీచేశారు. గతంలో స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తించిన మల్లేశంగౌడ్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి

జగిత్యాల: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు ప్రతీ బృందం సకాలంలో క్యాంపులు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. జిల్లాలో ఉన్న వైద్య బృందాలు సమీప పట్టణాలు, మండల హెడ్‌క్వార్టర్లలో నైట్‌హాల్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని, ఉదయం 8.45 తప్పనిసరిగా బృందాలు క్యాంప్ లొకేషన్‌కు చేరుకోవాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీటీచర్లు, ఆశా కార్యకర్తలు ఆర్పీలు, వీఏవోలను భాగస్వాములను చేయాలన్నారు. ప్రతి వైద్య బృందానికి క్యాంప్‌నకు అవసరమయ్యే సామగ్రి, మందులు, కళ్లద్దాలు అందించాలన్నారు. ప్రజలకు కంటి వెలుగు ఆహ్వాన పత్రికలు పంచాలన్నారు. ప్రతీ చోట ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ రవి మాట్లాడుతూ.. జిల్లాలో 46 బృందాలతో కంటివెలుగు నిర్వహిస్తున్నమని, అవసరమైన సామగ్రి అందుబాటులో ఉందన్నారు. బృందాలు క్యాంప్‌నకు వెళ్లేందుకు వాహనాలను సిద్ధం చేశామన్నారు. అడిషనల్ కలెక్టర్లు బీఎస్.లత, మకరంద్ పాల్గొన్నారు.

భూమి కేటాయింపు

సారంగాపూర్: రోల్లవాగు కట్ట నిర్మాణానికి కందెనకుంట శివారులో 15ఎకరాలు కేటాయిస్తున్నట్లు అదనపు కలెక్టర్ లత పేర్కొన్నారు. గురువారం రోల్లవాగు పనులు పరిశీలించారు. కట్ట నిర్మాణానికి మట్టిసేకరణ ఇబ్బందికరంగా మారిందని అధికారులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కందెనకుంట శివారులో 15ఎకరాల రెవెన్యూ భూమి ఉందని, అవసరమైన లక్ష క్యూబిక్ మీటర్ల మట్టిని వాడుకోవాలని సూచించారు. తక్షణమే భూమిని ప్రాజెక్టు వారికి అప్పగించాలని తహసీల్దార్ శ్రీలతను ఆదేశించారు. ఆర్డీవో మాధురి, నీటిపారుదలశాఖ డీఈ చక్రునాయక్, తదితరులు ఉన్నారు.

మాస్టర్ ప్లాన్ రద్దు బాధ్యత ఎమ్మెల్యే సంజయ్‌దే..

- రైతుల హక్కులు హరించొద్దు
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ పరిసర గ్రామాల రైతులు తమ భూములపై హక్కును కోల్పోయేలా ఉందని, ఆయా గ్రామాల సర్పంచ్‌లను మభ్యపెట్టి రైతుల భూములను చెరబట్టే ప్రక్రియను విరమించుకుని మాస్టర్ ప్లాన్‌ను పట్టణానికే పరిమితం చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల బల్దియా మాస్టర్ ప్లాన్ ముసాయిదా విషయమై గురువారం ఇందిరాభవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్‌తో నష్టపోతున్న రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వందల ఎకరాల ప్రభుత్వ భూములను వదిలేసి జిల్లాకేంద్రానికి సమీపంలో ఉన్న మోతె, తిమ్మాపూర్, తిప్పన్నపేట, లింగంపేట, నర్సింగాపూర్ గ్రామాల్లో రైతుల భూములను రిక్రియేషన్, ఇండస్ట్రియల్, పబ్లిక్, సెమీ పబ్లిక్ జోన్లలో చేర్చడంతో ఆందోళనకు గురైన రైతులు రోడ్డెక్కుతున్నారని అన్నారు. ప్రజాభిప్రాయమే తన అభిప్రాయమన్న ఎమ్మెల్యే సంజయ్ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామన్న ఎమ్మెల్సీ పత్రికా ప్రకటనలకే పరిమితం కాకుండా మాస్టర్‌ప్లాన్ ముసాయిదాను రద్దు చేయించి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలపై నెపం నెట్టి యావర్‌రోడ్డు విస్తరణను వాయిదా వేస్తున్న అధికారపార్టీ నాయకులకు రాబోయేరోజుల్లో ప్రజలే సమాధానం చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో బల్దియా ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య, నాయకులు గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, జున్ను రాజేందర్, గుండ మధు, మునీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న లక్ష్మీపార్వతి

జగిత్యాల: జగిత్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వృక్షశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ పడాల తిరుపతి, నల్గొండ జిల్లా అనుమల మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆదె సత్యనారాయణ కలిసి రచించిన సైన్స్‌అండ్ టెక్నాలజీ పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ తెలుగు సంస్కృతి అకాడమీ చైర్మన్ లక్ష్మీపార్వతి ఆవిష్కరించారు. ఈ పుస్తకాలను రూపొందించడంలో రచయితలు ఎంతో శ్రమించి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రావు, విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.




అలిశెట్టి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, వివేకానందుడికి సత్యనారాయణ నివాళి

ఘన నివాళి

జగిత్యాలటౌన్: జిల్లావ్యాప్తంగా స్వామి వివేకానంద జయంతి, అక్షరసూర్యుడు అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన క్రీడల శాఖ, పట్టణ పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో నిర్వహించిన వివేకానంద 150వ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. డీవైఎస్‌వో నరేశ్, డీఎస్పీ ప్రకాశ్ పాల్గొన్నారు. హిందూవాహినీ ఆధ్వర్యంలో జగిత్యాల టవర్‌సర్కిల్‌లో వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పించారు. మార్కెట్ ఏరియాలో ఉన్న వివేకానంద విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు నివాళి అర్పించారు.

అలిశెట్టి ప్రభాకర్‌కు..

అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతిని జిల్లాకేంద్రంలోని అంగడిబజారులోని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ అలిశెట్టి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలిశెట్టి ప్రభాకర్ తన రచనలతో సమాజంలోని రుగ్మతలను ఎత్తిచూపారని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూరులో డీఈవో పర్యటన

వెల్గటూర్: విద్యార్థులు వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. వివేకానంద జయంతి సందర్భంగా వెల్గటూర్ జెడ్పీ పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పాఠశాలలోని 320మంది విద్యార్థులకు రూ.1.50లక్షల విలువైన క్రీడాదుస్తులను కరీంనగర్‌కు చెందిన డాన్‌బాస్కో హైస్కూల్ పూర్వ విద్యార్థులు అందించగా వారిని డీఈవో అభినందించారు. ఎంపీపీ కూనమల్ల లక్ష్మీ, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, సర్పంచ్ మెరుగు మురళితో కలిసి క్రీడాదుస్తులు అందించారు. దొరిశెట్టి వెంకటయ్య ఆర్థిక సహకారంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన టేబుల్‌టెన్నిస్‌ను ప్రారంభించారు. కొత్తపేట జెడ్పీ పాఠశాలలో మనఊరు– మనబడి పనులు పరిశీలించారు.

ఊపిరి తీసుకుంటున్నారు..

- మానసిక ఒత్తిడితో పెరుగుతున్న ఆత్మహత్యలు
- ఆర్థిక ఇబ్బందులతో మరికొంత మంది
- ఏడాది వ్యవధిలో జిల్లాలో 80 బలవన్మరణాలు

'ధర్మపురి మండలం కొన్నూరుపల్లికి చెందిన పూదరి బాలయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాలేదు. అనారోగ్యం భరించలేక గతేడాది డిసెంబర్ 1న ఆత్మహత్య చేసుకున్నాడు.'

'మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన అప్పల వికాస్ (19)అనే యువకుడు తల్లిదండ్రులు రూ.3 వేలు ఇవ్వలేదని ఈనెల 2న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.'

'జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంకు చెందిన కాటిపల్లి రాకేశ్ (41) ఆరోగ్యం బాగోలేకపోవడంతో మనస్తాపానికి గురై ఈనెల 9న పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

జగిత్యాలక్రైం: క్షణికావేశం ఆయువు తీస్తోంది. అనాలోచిత నిర్ణయం నిండు జీవితాన్ని నాశనం చేస్తోంది. ఎంతో విలువైన ప్రాణాన్ని బలితీసుకుంటోంది. జిల్లాలో కొద్దికాలంగా ఆత్మహత్యల పరంపర ఆందోళన కలిగిస్తోంది. అనారోగ్యం, ఆర్థిక సమస్యలు, మానసిక ఒత్తిళ్లు, ప్రేమ, ఇలా కారణం ఏదైనా.. బలవన్మరణమే పరిష్కారంగా పదిహేనేళ్ల వయసువారి నుంచి పండు ముసలివరకు తీసుకుంటున్న నిర్ణయం ఆయా కుటుంబాల్లో విషాదం నింపుతోంది.

క్షణికావేశంలోనే..

- జిల్లాలో 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు వివిధ కారణాలతో 80 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. మానసిక స్థితి సరిగ్గా లేకపోవడం, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, గృహ హింస, చదువులో విఫలమవడం, ప్రేమ వైఫల్యం, సెల్‌ఫోన్ కొనివ్వలేదని, డబ్బులివ్వడం లేదనే వంటి కారణాలతో ఈ బతుకు నాకొద్దు.. అంటూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి.
- బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆత్మహత్యకు కారణం కడుపునొప్పిగా అనారోగ్య సమస్యలుగా మాత్రమే పోలీసు రికార్డులకెక్కుతున్నాయి. ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో ఎక్కువగా 15– 40 ఏళ్ల వయస్సులోపు వారే ఉంటున్నారు.
- మారుతున్న జీవన సరళిలో ఆశలకు, వాస్తవానికి మధ్య అగాధం పెరిగి తమ ఆశలను నెరవేర్చుకోవడంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గతంలో ఎక్కువగా ఉమ్మడి కుటుంబాలుండటంతో కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మానసిక వేదనకు గురైతే కుటుంబ పెద్దలు వారిని సముదాయించి పరిష్కారం చూపేవారు.
- ప్రస్తుతం ఒంటరి కుటుంబాల్లో ఏ సమస్య వచ్చినా ఎవరికి వారే పరిష్కరించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. తమ స్థితిని మించిన కోరికలు, వాటిని తీర్చుకోలేక మనోవేదనకు గురవుతున్నారు. తమ సామర్థ్యాన్ని మించి అప్పులు చేయడం, దాంతో తీవ్రమైన వేదనకు గురై ఆగ్రహావేశాలకు వెళ్లి పిల్లాపాపలతో సహా ఆత్మహత్య చేసుకుంటున్న వారి సంఖ్య జిల్లాలో ఇటీవల పెరిగింది.



మానసిక ఒత్తిడితోనే



చాలా మంది యువకులు మానసిక ఒత్తిడితో, వృద్ధులు వయోభారంతో మరికొంత మంది కుటుంబ సమస్యలు, చెడు వ్యసనాలకు అలవాటు పడి క్షణికావేశంలో ఆత్మహత్మలకు పాల్పడుతున్నారు. ఒంటరిగా ఉన్నప్పుడే మానసిక ఒత్తిడికి గురవుతాం. బాధలను తీర్చుకోవాలి తప్ప ఆత్మహత్య చేసుకోవడం సరికాదు.

– డాక్టర్ సంతోష్, సైకాలజిస్ట్, జగిత్యాల

ధైర్యం కోల్పోవద్దు



చాలా మంది ఏదైనా గొడవలు జరిగినప్పుడు క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొంత మంది మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావు. ధైర్యంతో ఎలాంటి సమస్యలైనా ఎదుర్కొంటే జీవితంలో మనిషి నిలదొక్కుకోవచ్చు.– డాక్టర్ మల్లారెడ్డి, ఎండీ ఫిజీషియన్, జగిత్యాల

ఆత్మహత్య మార్గం కాదు



చాలా మంది ఆత్మస్థైర్యం కోల్పోయి చిన్నచిన్న సమస్యలకు మనస్తాపానికి గురై క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎన్ని సమస్యలు వచ్చినా ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలే తప్ప ఆత్మహత్యలకు పాల్పడవద్దు. గతంలో గ్రామాల్లో పోలీసు కళాబృందాలతో ఆత్మహత్యల నివారణ కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాం. సామాజిక సేవకులు కూడ ప్రజలకు అవగాహన కల్పించాలి.

– ప్రకాశ్, డీఎస్పీ, జగిత్యాల

క్లుప్తంగా

అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

సారంగాపూర్(జగిత్యాల): ఓ వివాహితను అదనపు వరకట్నం కోసం వేధించిన అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలంలోని పోచంపేటకు చెందిన కోంద్ర మానసను జగిత్యాల పట్టణానికి చెందిన రాజేంద్రప్రసాద్‌కు ఇచ్చి, 20 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. ఈ దంపతులకు పిల్లలు లేరు. ఈ క్రమంలో కొన్ని నెలలుగా మానసను అదనపు కట్నం తీసుకురావాలని భర్త రాజేంద్రప్రసాద్‌తోపాటు, అత్త లింగమ్మ, మామ గంగారాంలు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. దీంతో మానస గురువారం సారంగాపూర్ ఠాణాకు వెళ్లింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్తామామపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పుస్తెలతాడు చోరీ

మల్లాపూర్(కోరుట్ల): ఓ వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మొగిలిపేటకు చెందిన చిట్యాల నర్సు గురువారం కిరాణ దుకాణానికి వెళ్లి, తిరిగి ఇంటికి వస్తోంది. మార్గమధ్యలో బైక్ వచ్చిన ఇద్దరు దుండగులు ఆమెపై దాడి చేసి, మెడలోని పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. ఎస్సై నవీన్ కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి, విచారణ చేపట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతుల సేవలో ‘ఆగ్రోస్’ కేంద్రాలు

- జిల్లాలో 35 సెంటర్ల ద్వారా ఎరువులు, విత్తనాల అందజేత
- ఆధునిక యంత్రాలు తెప్పించి, అద్దెకు ఇచ్చేలా ఏర్పాట్లు

జగిత్యాల అగ్రికల్చర్: ఒకప్పుడు బీడు భూములను సాగుకు అనుకూలంగా మార్చడంలో క్రియాశీలక పాత్ర పోషించిన ప్రభుత్వ సంస్థ ఆగ్రోస్ సరికొత్తగా రైతులకు సేవలందించేందుకు సిద్ధమైంది. పంటల సాగుకు అవసరమైన రసాయన ఎరువులు, విత్తనాలను సరసరమైన ధరలకు అందిస్తూ వారి అభిమానాన్ని చూరగొనే ప్రయత్నం చేస్తోంది.

దరఖాస్తు చేసుకుంటే అవకాశం..

జగిత్యాల జిల్లాలో 35 ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు పని చేస్తున్నాయి. ఈ కేంద్రాలు అసలే లేని మండలాల్లో దరఖాస్తులు చేసుకున్న వారందరికీ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న మండలాల్లో మరిన్ని రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని జగిత్యాల రూరల్ మండలంలో 4, మెట్‌పల్లి, మేడిపల్లి, రాయికల్, బీర్‌పూర్ మండలాల్లో మూడు చొప్పున, మల్లాపూర్, కోరుట్ల, కథలాపూర్, కొడిమ్యాల, మల్యాల, సారంగాపూర్ మండలాల్లో రెండు చొప్పున, జగిత్యాల అర్బన్, ఇబ్రహీంపట్నం, భీమారం, ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్, గొల్లపల్లి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున పని చేస్తున్నాయి. పెగడపల్లితోపాటు నూతనంగా ఏర్పడిన ఎండపల్లి మండలంలో ఒక్క కేంద్రం కూడా లేదు.



చల్‌గల్‌లో ఏర్పాటు చేసిన ఆగ్రోస్ సేవా కేంద్రం

మార్క్‌ఫెడ్ నుంచి 20 శాతం ఎరువులు..

ఆగ్రోస్ సంస్థ గ్రామాల్లోని ఆగ్రోస్ సేవా కేంద్రాలను ఉన్నంతగా తీర్చిదిద్దేందుకు రసాయన ఎరువులను సరఫరా చేసే మార్క్‌ఫెడ్, విత్తనాలను సరఫరా చేసే తెలంగాణ సీడ్స్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు మార్క్‌ఫెడ్ జిల్లాకు సరఫరా చేసే రసాయన ఎరువుల్లో 20 శాతం ఈ సెంటర్లకు సరఫరా చేస్తుంది. తెలంగాణ సీడ్స్ సైతం నాణ్యమైన విత్తనాలను ముందుగా ఆగ్రోస్ కేంద్రాలకు అందిస్తుంది. వీటి నిర్వాహకులు కొంత కమీషన్ చూసుకొని, రైతులకు విక్రయిస్తున్నారు. ప్రైవేట్ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణదారులతో పోల్చితే, ఆగ్రోస్ సెంటర్లలో నాణ్యమైన ఉత్పత్తులు తక్కువ ధరకు లభిస్తున్నాయి. దీనికితోడు అన్నదాతల అభిమానాన్ని చూరగొన్న ప్రైవేట్ కంపెనీల నుంచి రసాయన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తెప్పించేలా ఆయా కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. ఆధునిక యంత్రాలను తెప్పించి, రైతులకు అద్దెకు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది.

విజయ డెయిరీ, హరే కృష్ణలతో ఒప్పందం

పాల సేకరణలో అగ్రగామిగా నిలిచిన విజయ డెయిరీ, ఇస్కాన్ టెంపుల్స్ నిర్మించిన హరే కృష్ణ సంస్థలతో ఆగ్రోస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామాల్లోని రైతుల వద్ద నుంచి పాలు సేకరించి, విజయ డెయిరీకి కమీషన్ ప్రతిపాదికన ఇవ్వనున్నారు. జొన్న, సజ్జ, రాగులు, గోధుమ, కొర్రలు వంటి చిరుధాన్యాలతోపాటు వాటి ఉత్పత్తులను విక్రయించేందుకు ఇస్కాన్ సంస్థకు అందించనున్నారు.

ఉపాధి పొందుతున్న..



ఎంబీఏ చదివిన నేను, మూడేళ్ల క్రితం ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఉపాధి పొందుతున్న. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే విక్రయిస్తున్న. నమ్మకమైన సంస్థలకు చెందిన ఉత్పత్తులనే అమ్ముతున్న.

– నలువాల శ్రీనివాస్, చల్‌గల్

సంస్థకు పూర్వవైభవం తీసుకువస్తాం..



ఆగ్రోస్ సంస్థకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి, అన్నదాతలకు సేవలందిస్తున్నాం. రానున్న రోజుల్లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకొని, వారి ఉత్పత్తులను సైతం విక్రయించాలని చూస్తున్నాం.

– ప్రవీణ్, ఆగ్రోస్ ఆర్‌ఎం, జగిత్యాల

వివేకానందుడి స్ఫూర్తితో ముందుకుసాగాలి

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్


మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి: స్వామి వివేకానందుడి స్ఫూర్తితో యువత ముందుకుసాగాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం ఎంపీ వెంకటేశ్ నేత, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి, ధర్మపురిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎల్‌ఎం కొప్పుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. అంతకుముందు శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులకు, చింతామణి చెరువు సమీపంలోని పుట్ట బంగారం స్థలంలో సుమారు రూ.15 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న వివిధ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. బస్టాండ్ సమీపంలో రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తెమ్మ, జెడ్పీటీసీ సభ్యులు బాదినేని రాజేందర్, బత్తిని అరుణ, ఎంపీపీ చిట్టిబాబు, డీసీఎంస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ఇందారపు రామయ్య, అయ్యోరి వేణుగోపాల్, ఆకుల రాజేశ్, వొద్నాల ఉమాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అదనుచూసి హతమార్చింది

- నిత్యం తాగుడు.. వేధింపులు తాళలేక
- భర్తను హత్య చేసిన భార్య
- గడ్డపారతో పొడిచి దారుణం
- లంబాడితండాలో విషాదం
- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితురాలు
- అనాథలైన ముగ్గురు చిన్నారులు
- బాలరక్ష భవన్‌కు పిల్లల తరలింపు


వివరాలు తెలుసుకుంటున్న సీఐ ఇంద్రసేనారెడ్డి


తండ్రిని కోల్పోయిన చిన్నారులు

ఓదెల(పెద్దపల్లి): భర్త తాగుడుకు బానిసై నిత్యం వేధించడంతో తట్టుకోలేని భార్య అతడిని హతమార్చింది. మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి లండాడితండా గ్రామానికి చెందిన గుగులోతు తేజనాయక్(32)ను గురువారం ఉదయం భార్య గుగులోతు కవిత గడ్డపారతో కొట్టి హత్యచేసింది. సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి, పొత్కపల్లి ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. హుస్నాబాద్‌కు చెందిన కవితకు లండాడితండాకు చెందిన గుగులోతు తేజనాయక్‌తో 2010లో వివాహమైంది. కూలీ పనులు చేసుకునే తేజనాయక్ తాగుడుకు బానిసయ్యాడు. నిత్యం తాగి భార్యతో గొడవపడటంతో పాటు వేధించేవాడు. ఎప్పటిలాగే గురువారం ఉదయం తేజనాయక్ తాగి ఇంటి ముందున్న చింతచెట్టు కింద పడుకున్నాడు. దీంతో అదనుచూసిన కవిత ఇంట్లోని గడ్డపారతో తేజనాయక్ ఎడమవైపు మెడపై పొడిచి, విచక్షణ రహితంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు గుగులోతు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అతడి తల్లితండ్రులు ఇటీవలే మృతిచెందారు.


తేజనాయక్ మృతదేహం

నాన్నను నిద్ర లేపేలోపు అమ్మ చంపింది

‘తాగి చెట్టుకింద పడుకున్న నాన్నను లేపుదామని వెళ్లేసరికి లేవలేదు. అమ్మ వచ్చి గడ్డపారతో కొట్టి చంపింది’ అని మృతుడి కుమారుడు గుగులోతు మహేశ్(9), కూతురు మహదేవి(8), చిన్న కుమారుడు గిరేందర్(5) ఘటన స్థలంలో చెప్పినతీరు అక్కడివారిని కంటతడి పెట్టించింది. ‘నాన్నను కొట్టిన తర్వాత అమ్మ ఇంట్లోనుంచి పారిపోయింది. మేము ఊరి బడిలో చదువుకుంటున్నాం. రోజూ ఇంట్లో లొల్లి జరుగుతుంది’ అని చిన్నారులు పేర్కొన్నారు.

పిల్లలను చూసి చలించిపోయిన సీఐ

లండాడితండాలో గుగులోతు తేజనాయక్ హత్య స్థలాన్ని సందర్శించిన సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి మృతుడి పిల్లలను చూసి చలించిపోయారు. వారికి బిస్కెట్లు తినిపించారు. వారికి నీళ్లు తాగించి జరిగిన ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పెద్దపల్లి బాలరక్ష భవన్‌కు పిల్లలు

హత్యకు గురైన తేజనాయక్ పిల్లలు మహేశ్, మహదేవి, గిరేందర్‌లను పెద్దపల్లి బాలరక్ష భవన్‌కు తరలించాలని తండావాసులు సీఐ, ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. తేజనాయక్ అంత్యక్రియలు జరిగిన పిమ్మట తీసుకెళ్లాలని బాలరక్ష భవన్ కోఆర్డినేటర్‌కు సీఐ ఆదేశాలు జారీ చేశారు.

స్టేషన్‌లో లొంగిపోయిన నిందితురాలు

భర్త గుగులోతు తేజనాయక్‌ను హత్యచేసిన కవిత నేరుగా పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయింది. కవితపై హత్యకేసు నమోదు చేసి సుల్తానాబాద్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

మోడల్ స్కూల్ పిలుస్తోంది

- ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల
- ఫిబ్రవరి 15వరకు దరఖాస్తుకు గడువు



కరీంనగర్: మోడల్ స్కూల్స్‌లో 2023- 24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తుకు గడువు ఉంది. 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16న ఆయా పాఠశాలల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారని పాఠశాల విద్యా శాఖ అధికారులు వెల్లడించారు. 7,8,9,10వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరుగనుంది. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ.125, మిగతావారు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలు వెబ్‌సైట్ http://telanganams.cgg.gov.inలో పొందవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 38 పాఠశాలలు

ఉమ్మడి జిల్లాలో 38 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. కరీంనగర్‌లో చొప్పదండి మండలం రుక్మాపూర్, కరీంనగర్ మండలం ఎలగందల్, మానకొండూర్ మండలం పోచంపల్లి, రామడుగు, వీణవంక, జమ్మికుంట మండలం టేకుర్తి, చిగురుమామిడి మండలం ముల్కనూర్, గంగాధర, శంకరపట్నం, తిమ్మాపూర్, సైదాపూర్‌లో ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి 100 సీట్లు ఉంటాయి. 7,8,9,10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారు.

దరఖాస్తుల స్వీకరణ వివరాలు

ఈనెల 10నుంచి ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తుల స్వీకరణ. ఏప్రిల్ 8 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్. ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష. మే15న ఫలితాల ప్రకటన, సంబంధిత ప్రిన్సిపాల్స్‌కు మెరిట్ జాబితాల అందజేత. మే 24న మోడల్ స్కూళ్లలో విద్యార్థుల ఎంపిక జాబితా ఖరారు. అడిషనల్ కలెక్టర్ల ఆమోదం. మే 25 నుంచి 31 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం.

పరీక్ష విధానం

ప్రవేశ పరీక్షలో వంద మార్కులకు వంద ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో ఉంటుంది. ఆరో తరగతిలో తెలుగు, గణితం, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఆంగ్లం పాఠ్యాంశాల్లో ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు వస్తాయి. 7 నుంచి 10వ తరగతులకు గణితం, సామాన్య, సాంఘిక, ఇంగ్లిష్ సబ్జెక్టులు ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. రెండు గంటల పాటు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ ఉంది. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. క్రమశిక్షణ, మెరుగైన ఫలితాలతో ముందంజలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు.

– జనార్దన్‌రావు, డీఈవో, కరీంనగర్

బాలికలకు హాస్టల్ సౌకర్యం

ఆదర్శ పాఠశాలల్లో బాలికలకు మాత్రమే హాస్టల్ వసతి ఉంది. 9,10వ తరగతులతో పాటు ఇంటర్ చదువుతున్న వంద మందికి మాత్రమే అవకాశం ఉంది. హాస్టల్‌కు కనీసం 3 కి.మీటర్లు, ఆపై దూరంగా ఉండేవారు హాస్టల్‌లో ప్రవేశానికి అర్హులు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ధర్మపురి: ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గంగాధర్(48) చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురి మండలంలోని గాదెపల్లి గ్రామానికి చెందిన గంగాధర్ 15 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం పనులు ముగించుకొని, ఇంటికి వచ్చాడు. కాసేపటికే తనకు ఛాతిలో నొప్పిగా ఉందని కుటుంబసభ్యులకు చెప్పాడు. వారు హుటాహుటిన జగిత్యాలలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


గంగాధర్ (ఫైల్)



జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



కొడిమ్యాల(చొప్పదండి): కాకతీయ వర్సిటీ ఇండోర్ స్టేడియం హనుమకొండలో ఈ నెల 8న జరిగిన జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కొడిమ్యాల మండలం నాచుపల్లి వాసవి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కటా విభాగంలో ఎం.దశరథ్, ఎస్.వివేక్‌లు బంగారు, ఎం.మణితేజ వెండి, ఎ.అనుదీప్, జి.మణిదీప్, సీహెచ్.అమిత్, బి.వర్షితలు కాంస్య పతకాలు సాధించారు. కరస్పాండెంట్ బి.సతీశ్, కరాటే మాస్టర్ శ్రీనివాస్, టీచర్లు అభినందించారు.

వైఎస్సార్‌టీపీలో పలువురి చేరిక



కొడిమ్యాల(చొప్పదండి): మండలంలోని పూడూరులో పలువురు నాయకులు గురువారం వైఎస్సార్‌టీపీలో చేరారు. ఆ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యరాజ్‌వర్మ, జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణలు వారికి కండువాలు కప్పి, ఆహ్వానించారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ద్వారానే వైఎస్సార్ లక్ష్యాలు నెరవేరుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాలను అభివృద్ధి చేయాలి

- మంత్రి కేటీఆర్‌కు బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు లేఖ

జగిత్యాల: జగిత్యాలను అభివృద్ధి చేయాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు కోరారు. రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్‌కు గురువారం లేఖ రాశారు. కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ నుంచి 8 కి.మీ. మేర పట్టణ పరిధిలోకి తేవాలన్నారు. నూకపల్లిలో 4 వేలకు పైగా డబుల్ బెడ్‌రూం ఇళ్లవారికి ఆ ప్రాంతంలో ఉపాధి కల్పనకు పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలని, మల్యాల రోడ్ రామన్నపేట నుంచి తాటిపల్లి, మేడిపల్లి సమీపంలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. చల్‌గల్ వ్యవసాయ క్షేత్రంలో 200 ఎకరాలను పార్కులు, పారిశ్రామిక వాడలకు కేటాయించే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. జగిత్యాల జిల్లా కేంద్రంగా ఇప్పుడే అభివృద్ధి చెందుతోందని మెడికల్ కళాశాలను లక్ష్మీదేవిపల్లి పెంబట్ల వైపు ఏర్పాటు చేస్తే బాగుండేదని పేర్కొన్నారు. రింగ్ రోడ్ వేయాలని, జగిత్యాలలో మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రులు ఏర్పడటంతో జనాభా పెరుగుతుందని, అందుకు తగినట్లు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కండ్లపల్లి, ముప్పాల చెరువులను ట్యాంక్‌బండ్‌గా మారిస్తే ఇంకా అభివృద్ధి చెందుతాయన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు
- వీవీరావుపేటలో 5 రాష్ట్రాల వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

మల్లాపూర్(కోరుట్ల): క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతాయని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మల్లాపూర్ మండలంలోని వీవీరావుపేటలో నర్సింగం సార్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5 రాష్ట్రాల వాలీబాల్ టోర్నమెంట్‌ను గురువారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణానికి క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. టోర్నీ విజేతకు రూ.50 వేల నగదు బహుమతి అందిస్తానని ప్రకటించారు. కాగా టోర్నీ నిర్వహణకు బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్ కుమార్ రూ.20 వేలు, పీసీసీ డెలిగేట్ సభ్యుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు రూ.10 వేలు విరాళంగా అందించారు. జెడ్పీటీసీ సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు బిట్ల సరోజన, జోగుల మమత, ఎంపీటీసీ సభ్యులు గుగులోత్ భూమి, తోట సుజాత, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు మిట్టపెల్లి దివాకర్‌రెడ్డి, పోతు గోపి, సలహాదారు మచ్చర్ల దశరెడ్డి, నాయకులు యాదగిరి నర్సింగరావు, బిట్ల నరేష్, జోగుల రాజేశ్, గుగులోత్ రాజేందర్, తోట శ్రీని వాస్, మీనుగు చంద్రశేఖర్ తదితరులున్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

తమ్ముడిపై దాడి చేసిన అన్నకు ఏడాది జైలు

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలంలోని బాలపల్లికి చెందిన మొగుల్ల నరేశ్‌పై పారతో దాడి చేసిన అతని అన్న గంగమల్లుకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. గంగమల్లు జూలై 2, 2017న భూ వివాదంలో తన తమ్ముడు నరేశ్‌పై పారతో దాడి చేశారు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. తల్లి భూమక్క జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కిరణ్ కేసు నమోదు చేసి, గంగమల్లుపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. గురువారం ఏపీపీ రాజేశ్, కోర్టు పీసీ గుండ హరిప్రసాద్‌లు సాక్షులను ప్రవేశపెట్టగా జగిత్యాల మొదటి అదనపు న్యాయస్థానం మెజిస్ట్రేట్ గంగమల్లుకు ఏడాది జైలుశిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

జంగమ సమాజం నూతన కార్యవర్గం


జగదీశ్వర్


నిరంజన్

రాయికల్(జగిత్యాల): జంగమ సమాజం నూత న కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాయికల్ మండలంలోని మైతాపూర్‌కు చెందిన క్యాషనూరిమఠం జగదీశ్వర్, ఉపాధ్యక్షుడిగా మహేశ్ (మల్యాల), ప్రధాన కార్యదర్శిగా గుంటి నిరంజన్(జగిత్యాల), కోశాధికారిగా ప్రమోద్(కథలాపూర్), గౌరవ అధ్యక్షుడిగా అంగడిమఠం భువనేశ్వర్(అల్లీపూర్), సంయుక్త కార్యదర్శిగా శరత్(కథలాపూర్), ప్రచార కార్యదర్శిగా మహేశ్(దులూరు), గౌరవ సలహాదారుగా భద్రయ్య(జగిత్యాల) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ.. జంగమ సమాజం పటిష్టతకు కృషి చేస్తానని పేర్కొన్నారు.